క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలను సమర్పించి ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

నూతన జడ్జిగా పి.హేమ


జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్ : ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా పి.హేమ బాధ్యతలు స్వీకరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

యువ ఇంజినీర్‌కు సుప్రీంకోర్టు జడ్జి ప్రశంస

ఆదోని రూరల్: ఆదోని యువ ఇంజినీర్ రవిచంద్రను సుప్రీంకోర్టు న్యాయమూర్తి నాగరత్నమ్మ అభినందించారు. బెంగళూరులోని కర్ణాటక జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణంలో రవిచంద్ర ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తూ మంచి ప్రతిభ కనబరచడంతో న్యాయమూర్తిని అభినందించారని ఆయన గురువారం తెలిపారు.

మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలి

ఆదోని సెంట్రల్: పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకుడు భాస్కరాచారి డిమాండ్ చేశారు. గురువారం పురపాలక ఉన్నత పాఠశాలలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా పదోన్నతులు లేవు, ఐదు సంత్సరాలుగా బదిలీలు లేవని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తుందే గానీ సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదన్నారు. కార్యక్రమములో ఎంటీఎఫ్ నాయకులు బసవరాజు, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు

ఆదోని సెంట్రల్: సీబీఎస్‌ఈ విధానంలో విద్యార్థులకు సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 శ్రీనివాసులు తెలిపారు. గురువారం జనరల్ కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలో జరిగే సీబీఎస్‌ఈ సామర్థ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 8 పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సెలబస్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అయా పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 872 మంది ఉన్నారన్నారు. అందులో సీబీఎస్‌ఈ సామర్థ్య పరీక్షలకు గాను 862 మంది విద్యార్థులు హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమములో కస్తూర్బా ప్రిన్సిపాల్ శాంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కోసిగి: మేజర్ పంచాయతీ కోసిగిలో దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం కోసిగిలో పంచాయతీ కార్మికులచే పలు కాలనీల్లో ఫాగింగ్ చేయించారు. వారు మాట్లాడుతూ వర్షకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రధానంగా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే తాగు నీటిని కాచి వడబోసి తాగాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దకడబూరు : మండల కేంద్రానికి చెందిన మొట్రు ఆంజనేయులు వద్ద ఉన్న 94 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆయనను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మొట్రు ఆంజనేయులు గురువారం స్థానిక బస్టాండ్ సమీపంలోని చింతచెట్టు వద్ద కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో వెళ్లి తనిఖీ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశామన్నారు.

నిర్వహణలేక.. నివాసయోగ్యంకాక!

- శిథిలావస్థలో ఆదోని పోలీసు క్వార్టర్స్
- మొత్తం 121 భవనాలు.. శిథిలావస్థలో 116
- మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా స్పందన కరువు
- అద్దె ఇళ్లలోకి చేరుకున్న పోలీసులు


శిథిలావస్థకు చేరిన బిల్డింగ్


భూత్ బంగ్లాగా మారిన పోలీస్‌క్వార్టర్స్

ఆదోని అర్బన్: ఏదైనా ఘటన జరిగిన వెంటనే రాత్రనకా పగలనకా వర్షం, చలి లెక్కచేయకుండా.. తిండి తిప్పలు, కుటుంబ సభ్యులను వదిలి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులది. ఇలాంటి వృత్తిలో కొనసాగుతున్న రక్షకభటులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వాలు, పోలీసు శాఖ వారు కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. ఆదోని పట్టణంలో ని పోలీసుక్వార్టర్స్ మరమ్మతులకు నోచుకోలేక శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోకపోవడం విడ్డూరం.

1998లో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం

పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ వెనకభాగంలో స్టేషన్‌తో పాటు 4.12 ఎకరాల స్థలంలో 1998 సంవత్సరంలో 121 పోలీసు క్వార్టర్స్ నిర్మించారు. అందులో 4 పోలీసు ఆఫీసర్‌లకు, రెండు ఎస్ఐలకు కేటాయించారు. ఇందులో సింగిల్ బెడ్‌రూమ్, ఒక హాల్, కిచెన్, బాత్‌రూమ్‌లు ఉంటాయి. నేటికి 26 సంవత్సరాలు గడిచింది. కనీస నిర్వహణ లేకపోవడంతో రానురాను బిల్డింగ్‌లు మరమ్మతులకు గరయ్యాయి. అయినా మరమ్మతులు చేపట్టే నాథుడే కరువవ్వడంతో క్వార్టర్స్‌లో సమస్యలు తిష్టవేశాయి. భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చేసేదిలేక రక్షకభటులు క్వార్టర్స్‌ను వదిలి బాడుగ ఇళ్లల్లో చేరుతున్నారు.

భూత్ బంగ్లాను తలపిస్తున్న పోలీస్ క్వార్టర్స్

టూటౌన్ పోలీస్‌స్టేషన్ వెనక ఉన్న పోలీస్ క్వార్టర్స్ బిల్డింగ్‌లన్నీ అడవిలో ఉన్నట్లు కనిపిస్తాయి. గుంతల రోడ్లు, అందులో వర్షపునీరు, పిచ్చిపిచ్చి మొక్కలు, పెద్దపెద్ద చెట్లతో ఉన్న బిల్డింగ్‌లు దర్శనమిస్తున్నాయి. అంతేగాకుండా శిథిలావస్థకు చేరిన బిల్డింగ్‌లు పడిపోయి భూత్ బంగ్లాగా కనిపిస్తాయి.


భవనం చుట్టూ చెట్లు పెరిగిన దృశ్యం

2016లో మరమ్మతులకు ప్రతిపాదనలు

2016లో అధికారులు మరమ్మతులు చేపట్టాలని అప్పటి ఐపీఎస్ అధికారి రవికృష్ణకు ప్రతిపాదనలు పెట్టారు. 2017 సంవత్సరంలో ఏపీస్టేట్ పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ వారు సందర్శించి 81 బిల్డింగ్‌లు నిరుపయోగంగా మారాయని, పూర్తిగా పనిచేయవని వెల్లడించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ క్వార్టర్స్‌ను పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రస్తుతం 121 క్వార్టర్స్‌లో 116 శిథిలావస్థకు చేరుకున్నాయి. కేవలం ఐదు మాత్రమే నివాసయోగ్యంగా ఉండగా.. అందులో బ్యాచిలర్ కానిస్టేబుళ్లు ఉంటున్నారు.

నియోజకవర్గంలో ఏడు పోలీస్‌స్టేషన్‌లు

ఆదోని నియోజకవర్గంలో ఏడు పోలీస్‌స్టేషన్‌లు, ఒక కంట్రోల్ రూమ్ ఉంది. పట్టణంలో మూడు, ఒక ట్రాఫిక్, రూరల్ పరిధిలో ఒక తాలూకా, ఒకటి ఇస్వీ, మరొకటి పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. అలాగే డీఎస్పీ బంగ్లాలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఉంటారు. ఆఫీసర్లు, ఎస్ఐలతో పాటు ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు 160 మంది దాకా ఉన్నారు. ఇందులో 25 నుంచి 30 మంది అటాచ్‌లుగా పని చేస్తున్నారు. మొత్తంగా ఆదోని నియోజకవర్గంలో 130 మంది పని చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. వాటి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి నూతన నిర్మాణం చేపట్టాలని తెలియజేశాం. త్వరలో అసెంబ్లీలో గానీ, ఏపీ స్టేట్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పెట్రోల్ బంకు కూడా మంజూరయ్యింది. పోలీస్‌స్టేషన్ పక్కన పంపుతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– సూర్యమోహన్‌రావు, ఆదోని టూటౌన్

నాలుగు ఇళ్లల్లో చోరీ

ఆదోని అర్బన్: స్థానిక తిరుమలనగర్‌లోని నాలుగు ఇళ్లల్లో చోరీ జరిగిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మూడు ఇళ్లల్లో ఏమీ లేకపోవడంతో చోరీ విఫలయత్నం జరిగింది. మరొక ఇంట్లో నాలుగు తులాల బంగారం, ఒక తులం వెండి, రూ.2 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు ఇంటి యజమాని బేల్దారి రామ్మూర్తి తెలిపారు. తను ఫంక్షన్ కోసం వేరే ఊరికి వెళ్లగా, గురువారం తెల్లవారుజామున చోరీ జరిగిందని, ఇంటికొచ్చి చూస్తే ఇంటి తాళాలు పగలగొట్టారని వెల్లడించారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు.

కళాశాలను పరిశీలించిన నాక్ బృందం


అధ్యాపక సిబ్బందితో నాక్ బృందం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రెండు రోజులుగా నాక్ బృందం పరిశీలించింది. ఇందులో భాగంగా గురువారం కళాశాలలో అన్ని డిపార్ట్‌మెంట్లను ల్యాబ్‌లను, గ్రీవెన్స్, రెడ్రెస్ సెల్‌లను పరిశీలించి సిబ్బందికి బృంద సభ్యులు పలు సూచనలిచ్చారు. కళాశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో అధ్యాపకులను అభినందించారు. హెల్త్ సెంటర్‌ను పరిశీలించి డాక్టర్ పరిమళ, హెల్త్ అసిస్టెంట్లు వరలక్ష్మి, కమలమ్మను వైద్య పరంగా వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో అన్ని అంశాలపై బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా తెలిపారు.

ఉరుకుంద క్షేత్రం.. భక్తజన సంద్రం



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి, క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ గురువారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఉరుకుంద క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఇక్కడ మూడవ సోమవారం, మూడవ గురువారాలకు ప్రత్యేకత ఉండడంతో భక్తులు అధికంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. అందులో భాగంగానే గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో తెల్లవారు జామున 3గంటల నుంచే దర్శనానికి వదిలారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయి దేవాలయం వెలుపల నుంచే స్వామిని దర్శించుకోవడం కనిపించింది. స్వామిని దర్శించుకుని నైవేద్యం సమర్పించడానికి భక్తులు బుధవారం రాత్రి నుంచే తరలిరావడంతో ఈరన్న క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆరుబైటే భక్తులు వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారు జామున స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి వదిలారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


విరుపాపురం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్


పెద్దకొత్తిలి సచివాలయం ఆవరణలో మొక్క నాటుతున్న సర్పంచ్ శివన్న


హెచ్. కైరవాడి సచివాలయం ఆవరణంలో మొక్కలు నాటుతున్న అధికారులు

పెద్దకడబూరు: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టినటువంటి అమ్మకు ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: కౌతాళం జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో టెంకాయ మొక్కలను నాటారు. అధ్యాపకులు డేవిడ్, రవికుమార్, రాఘవేంద్రరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలోని విరుపాపురం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రహ్లాదయాదవ్ ప్రారంభించారు.

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ గ్రామంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల హైస్కూల్ ఆవరణలో గురువారం ఎంపీడీఓ గీతావాణి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

నందవరం: మండల పరిధిలో పెద్దకొత్తిలి, నదికైరవాడి గ్రామాలతో పాటు అన్ని పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సర్పంచులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బైటిగేరి శివన్న, ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : హెచ్. కైరవాడి సచివాలయం ఆవరణంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, ఏఓ బాబు భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఆరేకల్ హైస్కూల్‌లో విద్యార్థినులతో మొక్క నాటిస్తున్న ఎంపీడీఓ గీతావాణి


పెద్దకడబూరులో మొక్క నాటుతున్న ఎంపీపీ శ్రీవిద్య


కౌతాళం కళాశాలలో టెంకాయ మొక్క నాటుతున్న దృశ్యం

ముగిసిన ఆరాధన మహోత్సవాలు



పూల అలంకారంలో మంగరాయ ఆంజనేయస్వామి, రథోత్సవంలో పాల్గొన్న బ్రాహ్మణ భక్తులు

ఆదోని అర్బన్: మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా స్థానిక మంగరాయ సన్నిధిలో నిర్వహిస్తున్న ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆధ్వర్యంలో మంగరాయ ఆంజనేయస్వామి, రాఘవేంద్రస్వామి వార్లకు ఫల, పంచామృతాభిషేకం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


ప్రాజెక్టు స్టేజ్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాలు

గోనెగండ్ల : కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాల నాయకులు పాండు, నాగరాజు, మనోహర్ డిమాండ్ చేశారు. ఆయా విద్యార్థి సంఘాల ఆధ్వర్యం గురువారం జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద ఎమ్మిగనూరు– కర్నూలు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షిస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో గ్రామీణ ఆటో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ఆటో కార్మికులను దృష్టిలో వుంచుకొని పాలకులు పెట్రోల్, డీజిల్ ధరలను అదుపులో తెస్తామని చెప్పి, నేడు ఆ హామీని విస్మరించారన్నారు. అనంతరం ఆటో వర్కర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా రాముడు, అధ్యక్షుడిగా రామాంజినేయులు, ఉపాధ్యక్షుడిగా మహలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా అహమ్మద్ హుసేన్, సహాయ కార్యదర్శిగా రాఘవేంద్ర, ఆర్థిక కార్యదర్శిగా ఎం.రాజును ఎన్నుకున్నారు.

నేడు గ్రామసభలు

కోసిగి/గోనెగండ్ల/నందవరం: అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామ ప్రత్యేక ఆఫీసర్ల సమక్షంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓలు రాజేంద్ర ప్రసాద్, ప్రవీణ్ కుమార్, దశరథ రామయ్య గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులు, పనుల పురోగతిని సభలో వివరించడం జరుగుతుందన్నారు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై గ్రామ సభలో చర్చించి ఆమోదం తీసుకుంటారని చెప్పారు. మండలంలోని వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు తదితర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

గ్రామసభకు ఎమ్మెల్యే హాజరు

కౌతాళం: కౌతాళం మేజర్ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరవుతారని చెప్పారు. వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, గ్రామప్రజలు రావాలన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: వచ్చే నెల 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె. సుధ అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో జడ్జి విలేకరులతో మాట్లాడుతూ మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించండి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు: ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలు ప్రతి రోజూ మెనూ తప్పక పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఎంఈఓ సువర్ణల సునీయం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక (మెయిన్) పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో దాదాపు అన్ని వంట ఏజెన్సీలు కొత్తవారు వచ్చారని, వారికి వంట చేయడంపై అవగాహన ఉండకపోవచ్చన్నారు. దీంతో వంట మెనూ ప్రకారం నాణ్యత పాటించకపోతే విద్యార్థులు పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎంఈఓతో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకొని నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

చీటీల పేరుతో మోసం

ఆదోని అర్బన్: చీటీల పేరుతో మోసం చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోసం చేసిన వారిపై చిట్ ఫండ్ యాక్ట్ కింద త్రీటౌన్ సీఐ రామలింగప్ప గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. నారాయణసింగ్, పద్మాభాయి కుమార్తె ప్రీతీసింగ్ రూ.2 లక్షలు చీటీ వేసిందని తెలిపారు. ఉపాధ్యాయుడు నాగన్న భార్య సుధారాణి రూ.2 లక్షలు చీటీని నెలకు రూ.12,500 చొప్పున రెండు చీటీలకు గానూ రూ.25 వేలు కట్టారని చెప్పారు. ఇలా 12 నెలలు కట్టి 13వ నెల చీటీ ఎత్తారని, సమయం అయిన వెంటనే ప్రీతిసింగ్‌ను డబ్బు ఇవ్వమని బుధవారం అడిగినందుకు సుధారాణి కొట్టిందని తెలిపారు. అంతేగాకుండా ప్రీతిసింగ్ తల్లిదండ్రులు నారాయణసింగ్, పద్మాభాయి సుధారాణిని చంపుతామని బెదిరించినట్లు చెప్పారు. ఇలా దాదాపు 20 మందిని మోసం చేశారని, వారిలో సుధారాణితోపాటు పార్వతి, జ్యోతి, లోకేష్, కిశోర్‌తో పాటు మరో 15 మంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్ ఫండ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రీతిసింగ్, ఆమె తల్లిదండ్రులు దాదాపు రూ.25 లక్షలు అప్పు తీసుకున్నట్లు సమాచారం.

28న భూ బాధితుల రాష్ట్ర సదస్సు


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: ఈనెల 28న ఆదోని పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, భూ బాధితులు హాజరై జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌బాబు, సీనియర్ నాయకులు కె.లక్ష్మిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అమాయక ప్రజల భూములను ఇంటి స్థలాలను దౌర్జన్యంగా ఆక్రమించుకొని అనుభవిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 28న భూ బాధితుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు సుదర్శన్, కల్లుబావిరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేదావతిలో పెరిగిన వరద ఉధృతి


మార్లమడికి వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న వేదావతి నది

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద ప్రవహిస్తున్న వేదావతి (హగరి) నదిలో గురువారం వరద ఉధృతి మళ్లీ పెరగడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షానికి మంగళవారం మధ్యాహ్నం నదిలో భారీగా వరద ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిన సంగతి తెలిసిందే. బుధవారం ఉధృతి తగ్గినట్టే తగ్గి రాత్రి మళ్లీ పెరగడంతో నది నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. హొళగుంద–బళ్లారి, సిరుగుప్పలకు ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు నిలిచిపోయి విద్యా, వైద్య, వ్యాపార పరంగా చాలా మంది ఇబ్బందులు పడ్డారు. దీంతో అధిక శాతం మంది ఆలూరు మీదుగా ఆదోని, బళ్లారికి రాకపోకలు సాగించారు. గురువారం రాత్రి కూడ ఉధృతి తగ్గకపోవడంతో పాటు ఇంకా పెరుగుతుండడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే.. హొళగుంద–ఆదోని మార్గంలోని నాగనాథనహళ్లి వద్దనున్న గర్జివంక పొంగి ప్రవహిస్తోంది.